సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

శనివారం । 14 । జనవరి । 2023

న్యూస్‌రీల్

'గోకుల రామం'లో విలాసోత్సవం



స్వామి వారికి విలాసోత్సవ పూజలు జరుపుతున్న అర్చకులు

భద్రాచలం: శ్రీ సీతారామ చంద్రస్వామి వారికి శుక్రవారం వనవిహారంలో విలాసోత్సవం ఘనంగా జరిపారు. ఏపీలోని పురుషోత్తపట్నంలో ఉన్న రామయ్య భూములోని గోకుల రామంలో ఈ వేడుకను కమనీయంగా నిర్వహించారు. తొలుత స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి పల్లకీలో మేళతాళాలు, భజనలు, కోలాటాల నడుమ ఊరేగింపుగా గోకుల రామం వద్దకు తీసుకొచ్చారు. వేదికపై కొలువుదీర్చి అర్చకులు ప్రత్యేక పూజలు జరిపి హారతిని సమర్పించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను అందచేశారు. కాగా వెంకటేశ్వర స్వామి అలంకరణలో దర్శనమిచ్చిన స్వామి వారిని భక్తులు పెద్ద ఎత్తున దర్శనం చేసుకున్నారు. శనివారం స్వామి వారికి విలాసోత్సవంతో పాటుగా ఆలయంలో గోదాదేవి కల్యాణం జరగనుంది. ఈ పూజలలో పట్టణ ప్రముఖులు హరిశ్చంద్ర నాయక్ దంపతులు, ఆలయ అర్చకులు, వేద పండితులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

నేడు మంత్రి హరీశ్‌రావు రాక

ఇల్లెందు: ఈ నెల 18న ఖమ్మంలో జరిగే బీఆర్ఎస్ బహిరంగ సభను విజయవంతానికి నేడు నిర్వహించనున్న సన్నాహక సమావేశానికి రాష్ట్ర ఆర్థిక, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు ఇల్లెందుకు రానున్నారు. శనివారం ఉదయం 10 గంటలకు మండలంలోని బొజ్జాయిగూడెం ఎస్ఎస్ ఫంక్షన్ హాల్‌లో ఈ సమావేశం నిర్వహించనున్నారు. మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, ఎమ్మెల్సీలు పల్లా రాజేశ్వర రెడ్డి, తాతా మధు, విప్ రేగా కాంతారావు, ఎంపీ కవిత, టీఎస్ఎంఎస్ఐడీసీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ కూడా పాల్గొంటారని, ఈ సమావేశాన్ని జయప్రదం చేయాలని ఎమ్మెల్యే హరిప్రియ కోరారు.

విజయవంతం చేయాలి

సీఎం కేసీఆర్ బహిరంగ సభను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ పట్టణ ప్రధాన కార్యదర్శి పరుచూరి వెంకటేశ్వరరావు కోరారు. శుక్రవారం ఇల్లెందు పట్టణంలోని 16వ వార్డులో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కౌన్సిలర్ గిన్నారపు రజిత, రవి, వార్డు నాయకులు పాల్గొన్నారు.

ఎక్కడా తగ్గొద్దు..



మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు, పక్కన మంత్రి పువ్వాడ, ఎంపీలు, ఎమ్మెల్యేలు

- చరిత్రలో నిలిచిపోయేలా ఖమ్మం సభ
- ఉమ్మడి జిల్లా నుంచి 3 లక్షల మందిని తరలిద్దాం
- మంత్రులు హరీశ్‌రావు, పువ్వాడ

ఖమ్మంమయూరిసెంటర్: జిల్లా కేంద్రంలో ఈనెల 18న జరగనున్న భారత రాష్ట్ర సమితి(బీఆర్ఎస్) తొలి సభ యావత్ దేశం దృష్టిని ఆకర్షించి, చరిత్రలో నిలిచిపోయేలా విజయవంతం చేయాలని సభ ఇన్‌చార్జ్ మంత్రులు తన్నీరు హరీశ్‌రావు, పువ్వాడ అజయ్‌కుమార్ పిలుపునిచ్చారు. ఖమ్మంలో శుక్రవారం ఉమ్మడి జిల్లా ప్రజాప్రతినిధులు, ముఖ్య నేతలతో సమీక్ష సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సమావేశంలో మంత్రులు హరీశ్‌రావు, పువ్వాడ మాట్లాడుతూ బహిరంగ సభను విజయవంతం చేసే విషయంలో ఎక్కడా తగ్గొద్దని సూచించారు. ఉమ్మడి జిల్లాలోని పది నియోజకవర్గాలతోపాటు పొరుగునే ఉన్న సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్ జిల్లాల్లోని పది నియోజకవర్గాలు కలిపి మొత్తంగా 20 నియోజకవర్గాల నుంచి ఐదు లక్షల మందిని సభకు తరలించేలా ఏర్పాట్లు జరుగుతున్నాయని తెలిపారు. ఇందులో ఉమ్మడి ఖమ్మం జిల్లా నుండే మూడు లక్షల మందిని సమీకరించాలని చెప్పారు.

వ్యూహాత్మకంగా జనసమీకరణ

బీఆర్ఎస్ ఆవిర్భావం తర్వాత తొలి సభ ఖమ్మంలో జరగడం అదృష్టంగా భావించి, అందుకు తగినట్లుగా వంద ఎకరాల్లో జరగనున్న సభను భారీ జన సమీకరణతో విజయవంతం చేసేలా మంత్రులు పలు సూచనలు చేశారు. ప్రజాప్రతినిధులు వ్యూహాత్మకంగా జన సమీకరణపై దృష్టి సారించాలని తెలిపారు. ఇందులో భాగంగా వాహనాల సేకరణ, రూట్ మ్యాప్, పార్కింగ్ తదితర అంశాలపై ముందస్తు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలన్నారు.

సభ ద్వారా బీఆర్ఎస్ అజెండాపై స్పష్టత

ఖమ్మం సభ ద్వారా దేశ రైతాంగం, ప్రజలు, రాజకీయ వర్గాలకు బీఆర్ఎస్ అజెండాపై పూర్తి స్పష్టత ఇవ్వనుందని మంత్రులు హరీశ్, పువ్వాడ చెప్పారు. సభకు ముగ్గురు ముఖ్యమంత్రులు, జాతీయ స్థాయి నేతలను ఆహ్వానిస్తున్న నేపథ్యాన బీఆర్ఎస్ సభను పార్టీ అధినేత, సీఎం కేసీఆర్ ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారని అన్నారు. జాతీయ రాజకీయాల్లో అరంగేట్రం తర్వాత తొలి సభ కావడంతో విజయవంతం చేయడాన్ని అందరూ బాధ్యతగా భావించాలని సూచించారు. ఈ సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి నూకల నరేష్ రెడ్డి, రైతుబంధు రాష్ట్ర అధ్యక్షుడు పల్లా రాజేశ్వరరెడ్డి, ఎంపీలు నామ నాగేశ్వరరావు, వద్దిరాజు రవిచంద్ర, బండి పార్థసారధిరెడ్డి, ఎమ్మెల్యేలు వనమా వెంకటేశ్వరరావు, హరిప్రియ, సండ్ర వెంకటవీరయ్య, రాములునాయక్, మెచ్చా నాగేశ్వరరావు, ఎమ్మెల్సీలు తాతా మధు, కౌశిక్‌రెడ్డి, జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్, రైతు సమన్వయ సమితి జిల్లా అధ్యక్షుడు నల్లమల వెంకటేశ్వరరావు, మేయర్ పునుకొల్లు నీరజ, డిప్యూటీ మేయర్ పాతిమ జోహర, సుడా చైర్మన్ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణకవచధారణలో రామయ్య

భద్రాచలం: శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానంలో శుక్రవారం అంతరాలయంలో మూలమూర్తులు స్వర్ణ కవచధారులై దర్శనమిచ్చారు. తొలుత తెల్లవారుజామున గర్భగుడిలో స్వామి వారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం నిత్యకల్యాణానికి బేడా మండపంలో కొలువుదీరిన స్వామి వారికి విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం చేశారు. స్వామి వారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా జరిపారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. శుక్రవారం సందర్భంగా శ్రీ లక్ష్మీ తాయారు అమ్మవారి ఆలయంలో అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు.

పెద్దమ్మతల్లికి పంచామృతాభిషేకం

పాల్వంచరూరల్: మండల పరిధిలోని పెద్దమ్మతల్లి ఆలయంలో అమ్మవారికి అర్చకులు శుక్రవారం పంచామృతాభిషేకం పూజలు వైభవంగా నిర్వహించారు. తొలుత మేళతాళాలతో అమ్మవారి జన్మస్థలం వద్ద పసుపు, కుంకుమ, గాజులు, హారతి సమర్పించారు. అనంతరం మూలవిరాట్‌కు అభిషేకం, పంచహారతులతో పూజలు చేయగా వేదపండితులు పద్మనాభశర్మ, అర్చకులు రవికుమార్‌శర్మ, దుర్గ ప్రసాద్‌శర్మ పాల్గొన్నారు. కాగా, ఆలయంలో ఈ నెల 29న రుద్రహోమం పూజలు నిర్వహిస్తున్నట్లు ఈఓ ఎస్.రజనీకుమారి తెలిపారు. పూజలో పాల్గొనాలనుకునే భక్తులు రూ.1,516 చెల్లించి గోత్రనామాదులు నమోదు చేసుకోవాలని, వివరాలకు 97054 79910, 98669 23261 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.



ఇంటింటా సంక్రాంతి..

- జిల్లావ్యాప్తంగా వేడుకలకు సిద్ధమైన ప్రజలు
- కొత్త అల్లుళ్లు, బంధువులతో ఇళ్లు కళకళ
- నేడు భోగభాగ్యాల భోగి

ముంగిట్లో సిరిసంపదలు.. వాకిళ్లలో రంగవల్లులు.. ఇళ్లలో బొమ్మల కొలువులు... నింగిలో పతంగులు.. మదిలో ఆనందాలు పొంగిపొర్లే వేడుక సంక్రాంతి. దక్షిణాయనాన్ని కాలపొరల్లోకి నెట్టివేసి ఉత్తరాయనాన్ని మోసుకొచ్చే రోజు. పాడి పంటలతో రైతన్న ఇళ్లు తులతూగుతుండగా.. ఇంటింటా డూడూ బసవన్నలు సందడి చేస్తున్నాయి. వీధివీధినా హరిదాసుల కీర్తనలు మార్మోగుతున్నాయి. మంచు తెరల నడుమ భోగి మంటలతో నేడు తెల్లవారుజామున వేడుకలు ప్రారంభంకానున్నాయి.



పాల్వంచరూరల్/కొత్తగూడెం టౌన్: సంక్రాంతి వేడుకలకు ఊరూవాడ సిద్ధమైంది. మూడు రోజుల పాటు జరుపుకునే భోగి, సంక్రాంతి, కనుమ పండుగకు జిల్లావ్యాప్తంగా ప్రజలు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. మహిళలు ఉదయాన్నే ముగ్గులతో లోగిళ్లను తీర్చిదిద్దనున్నారు. ఇప్పటికే రంగులు కొనుగోలు చేసి తెచ్చి పెట్టుకున్నారు. పండుగ నేపథ్యంలో వారం రోజులుగా చిన్నారులు పతంగులు ఎగురవేస్తున్నారు. యువకులు క్రీడా పోటీలు నిర్వహిస్తున్నారు. పలువురు ఆటల్లో ప్రతిభ చూపుతున్నారు. అలంకరణ వస్తువులతో ఇళ్లు కొత్తదనం సంతరించుకుంటున్నాయి. కొత్త అల్లుళ్లు, బంధువులతో కళకళలాడుతున్నాయి. జిల్లాకు సరిహద్దుగా ఉన్న ఏపీలో కోడి పందేలకు బిర్రులు సిద్ధమయ్యాయి.

రేగి పండ్లు, నవ ధాన్యాలు..

భోగి పండుగ రోజు చిన్న పిల్లలపై భోగి పండ్లు పోస్తారు. దీంతో మార్కెట్‌లో రేగు పండ్లు విక్రయిస్తున్నారు. ముగ్గుల్లో పెట్టే నవ ధాన్యాలను ప్యాకెట్లుగా చేసి మార్కెట్‌లో విక్రయిస్తున్నారు.

ఆకర్షణీయంగా గాలిపటాలు

మార్కెట్‌లో ఆకర్షణీయమైన పతంగుల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. పతంగిని బట్టి రూ. 20 మొదలు రూ. 600 వరకు కూడా ధరలు పలుకుతున్నాయి. విమానాలు, రాకెట్‌లు, సినిమా పేర్లు, హీరోలతో ఉన్న పతంగులు, సీతాకోక చిలుకలు వంటి పతంగులు విక్రయిస్తున్నారు. సంక్రాంతి సెలవులు కావడంతో పిల్లలు గాలి పటాలను ఎగురవేస్తున్నారు.

ఘుమఘుమలు..

ఇంటింటా పిండివంటలు ఘుమఘుమలాడుతున్నాయి. రెండు, మూడు రోజులుగా మహిళలు పిండి వంటల పనుల్లో నిమగ్నమయ్యారు. సకినాలు, అరిసెలు, మురుకులు, లడ్డూలు, చెక్క గారెలు, గవ్వలు తదితర తీపి, కారం కలిగిన పిండి వంటలను తయారుచేస్తున్నారు. సంక్రాంతి స్పెషల్ సకినాలు, అరిసెలు ఇప్పటికే తయారు చేసి డబ్బాలు, టిఫిన్లకు ఎత్తారు. పిండి వంటల్లో వినియోగించే బెల్లం, బియ్యం పిండి, నువ్వులు, జీలకర్ర, వాము వంటివి ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. ఒకవైపు చలిని తట్టుకునేందుకు, రక్తశుద్ధి వంటి వాటి కోసం ఈ పిండి వంటలు ఉపయోగపడతాయని పలువురు పేర్కొంటారు. ఈ పిండి వంటకాలు పౌష్టికాహారంగా కూడా ఉపయోగపడతాయి.



పిండి వంటలు రెడీ..



మార్కెట్‌లో విక్రయిస్తున్న నవధాన్యాల ప్యాకెట్లు

ఆనందంగా ఉంటుంది



నాలుగైదు రోజుల ముందుగానే ఇంటిల్లిపాది మొత్తం ఒక్కదగ్గర కూర్చుని వివిధ రకాల పిండి వంటకాలను తయారు చేశాం. అందరం కలిసి వంటకాలు చేయడమనేది ఎంతో ఆనందంగా ఉంటుంది. పండుగను మూడు రోజులపాటు ఘనంగా జరుపుకుంటాం. –శ్రీదేవి, పాల్వంచ

సకినాలే స్పెషల్..



సంక్రాంతి పండుగను ఇంటిల్లిపాది ఘనంగా జరుపుకుంటాం. మూడురోజుల ముందే పిండి వంటకాలను తయారుచేశాం. పండుగరోజు బంధువులకు, ఇరుగు పొరుగు వారికి పంచుకుంటాం. సంక్రాంతి అంటే సకినాలే స్పెషల్.

–సౌమ్యరెడ్డి, ప్రభాత్‌నగర్



కొత్తగూడెం బస్టాండ్‌లో ప్రయాణికుల రద్దీ

ఆర్టీసీ బస్టాండ్లలో సందడి

చుంచుపల్లి: సంక్రాంతి పర్వదినం సందర్భంగా ఆర్టీసీలో పండుగ సందడి నెలకొంది. హైదరాబాద్ తదితర ప్రాంతాల్లో ఉంటున్నవారు సొంతూళ్లకు వస్తున్నారు. దీంతో ఆర్టీసీ బస్సులు ప్రయాణికులతో కిటకిటలాడుతున్నాయి. కొత్తగూడెం, పాల్వంచ, భద్రాచలం తదితర బస్టాండ్లు శుక్రవారం కోలాహలంగా కనిపించాయి. డివిజన్ పరిధిలో 188 బస్సులు నడుపుతున్నామని, ప్రయాణికుల రద్దీ ఉంటే అప్పటికప్పుడు సర్వీసులు ఏర్పాటు చేస్తున్నామని ఆర్టీసీ అధికారులు తెలిపారు.

ఆకట్టుకున్న మాయాబజార్..



సురభి నాట్యమండలివారి మాయాబజార్ నాటికలోని ఓ దృశ్యం



నాటకోత్సవాలను ప్రారంభిస్తున్న కలెక్టర్ అనుదీప్

- సురభి నాటకోత్సవాలను ప్రారంభించిన కలెక్టర్ అనుదీప్

కొత్తగూడెంటౌన్: మాయాబజార్ నాటిక ప్రేక్షకులను ఆకట్టుకుంది. శుక్రవారం కొత్తగూడెం క్లబ్‌లో శ్రీవినాయక నాట్య మండలి(సురభి) ఆధ్వర్యంలో సురభి నాట్యవారోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ వేడుకలను కలెక్టర్ అనుదీప్ ప్రారంభించి, మాయాబజార్ నాటికను వీక్షించారు. నాటిక రెండు గంటలపాటు ప్రదర్శించగా, ఆటపాటలు, పద్యాలతో పాత్రల్లో ఒదిగిపోయిన కళాకారులు ప్రేక్షకులను కట్టిపడేశారు. హావభావాలతో మెప్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అంతరించిపోతున్న కళలను నమ్ముకుని జీవిస్తున్న కళాకారులను ప్రోత్సహించాలని చెప్పారు. ప్రజలను చైతన్యం చేసేది కళాకారులేనని పేర్కొన్నారు. సురభి నాట్యమండలి కళాకారులను అభినందించారు. శ్రీవినాయక నాట్యమండలి వ్యవస్థాపకులు కె.నర్సింహారావు కాగా నిర్వాహకులుగా ఆర్.వేణుగోపాలరావు వ్యవహరిస్తున్నారు. 17 కుటుంబాలు, 45 మంది కళాకారులు శనివారం నుంచి ఆరు రోజులపాటు నాటికలు ప్రదర్శించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పాతాళభైరవి, శ్రీనివాసకల్యాణం, భక్త ప్రహ్లాద, బాలనాగమ్మ, లవకుశ, అనార్కలి తదితర నాటికలు ప్రదర్శించనున్నారు. డీపీఆర్వో శ్రీనివాస్, కలెక్టరేట్ ఏఓ గన్యా పాల్గొన్నారు.

ప్రచార లోపంతో ప్రజాదరణ కరువు

సూపర్‌బజార్(కొత్తగూడెం): 138 సంవత్సరాల సుదీర్ఘ చరిత్ర.. ఎనిమిది తరాల నుంచి వృత్తి, ప్రవృత్తిగా నాటకరంగాన్నే నమ్ముకున్న శ్రీవినాయక నాట్యమండలి, సురభి నాటకోత్సవాలు.. శుక్రవారం రాత్రి ప్రారంభంకాగా ప్రజాదరణ కరువైంది. ఈ నెల 5వ తేదీన వచ్చామని, కలెక్టర్‌ను కలిసి సహాయసహకారాల కోసం అభ్యర్థించామని కళాకారులు పేర్కొంటున్నారు. తొలి నాటకానికి జనస్పందన లేకపోవడం ప్రచారలోపమే కారణమని ఆవేదనవ్యక్తం చేస్తున్నారు. వేళ్లమీద లెక్కించే స్థాయిలో ప్రేక్షకులు రావడం వారిని తీవ్ర మనోవేదనకు గురిచేస్తోంది.

మా ఊళ్లో వాలీబాల్ పండుగ..

- ఏటా సంక్రాంతికి జిల్లాస్థాయి పోటీల నిర్వహణ
- కొల్లాపురంలో 46 ఏళ్లుగా కొనసాగుతున్న ఆనవాయితీ..
- క్రీడానైపుణ్యంతో ప్రభుత్వ ఉద్యోగాలు పొందిన పలువురు
- అందరి శ్రమ సత్ఫలితాన్నిచ్చిందంటున్న గ్రామపెద్దలు



వాలీబాల్ ఆడుతున్న యువకులు (ఫైల్)

ఇల్లెందురూరల్: తెలుగు లోగిళ్లలో సంక్రాంతి పండుగ ఎంతో ప్రత్యేకం. పిల్లలు పతంగులతో సందడి చేస్తే మహిళలు ఇళ్ల ముందు అందమైన రంగవల్లులను తీర్చిదిద్దుతారు. ఇక యువకులు క్రీడా పోటీలు నిర్వహిస్తూ, ప్రతిభాపాటవాలు ప్రదర్శిస్తుంటారు. ఇలాగే ఇల్లెందు మండలం కొల్లాపురం గ్రామస్తులు 46 ఏళ్లుగా జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహిస్తున్నారు. యువతను ప్రోత్సహిస్తున్నారు. తొలుత రెండేళ్లపాటు గ్రామ పెద్దలు మండల స్థాయిలో ఆటలపోటీలు నిర్వహించారు. విజయవంతం కావడంతో జిల్లాస్థాయి పోటీలు నిర్వహిస్తున్నారు. గ్రామానికి చెందిన మోకాళ్ల పాపయ్య చొరవచూపి యువతను కలుపుకుని పోటీల నిర్వహణకు యంగ్‌స్టార్ యూత్ ఏర్పాటు చేశారు. ఇలా 1977లో యంగ్‌స్టార్ యూత్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహించారు. అప్పటినుంచి ప్రతి ఏటా సంక్రాంతి సందర్భంగా పోటీలు నిర్వహిస్తూ వస్తున్నారు. పంటలు చేతికందే సమయం, విద్యార్థులకు సెలవుల సమయం కావడంతో పోటీలు విజయవంతమవుతున్నాయి. ప్రస్తుతం మోకాళ్ల పాపయ్య కుమారుడు రమేష్ నిర్వహణ బాధ్యతలను కొనసాగిస్తున్నారు. నేడు గ్రామంలో పోటీలు ప్రారంభంకానున్నాయి.

జాతీయస్థాయిలో ప్రతిభ

వాలీబాల్ క్రీడలో యువతకు నైపుణ్యం పెంపొందేలా రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణిస్తున్న క్రీడా జట్లను ప్రత్యేక ఆహ్వానితులుగా పిలిపించి పోటీలలో పాల్గొనే అవకాశం కల్పించేవారు. సత్తుపల్లి, వరంగల్, మహబూబాబాద్ ప్రాంతాల నుంచి కొన్ని జట్లు ఈ పోటీల్లో పాల్గొనేవి. దీంతో గ్రామంలో పలువురు వాలీబాల్ క్రీడాకారులుగా జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయికి ఎదిగారు. స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగాలు కూడా సాధించారు. వారు ఏటా పోటీలకు హాజరవుతూ తమవంతు సహకారం అందిస్తున్నారు. వీరి స్ఫూర్తితో పరిసర గ్రామాల్లో కూడా యువకులు వాలీబాల్ సాధన చేస్తున్నారు. నూతన సంవత్సరం, మహాశివరాత్రి, దసరా వేడుకల సందర్భంగా వాలీబాల్ పోటీలు నిర్వహిస్తున్నారు. వాలీబాల్ క్రీడకు ఉమ్మడి ఖమ్మం జిల్లాలో కొల్లాపురం ప్రత్యేకత సంతరించుకుంది.

పలువురికి ప్రభుత్వ ఉద్యోగాలు..

గ్రామం నుంచి ఇప్పటివరకు 30 మంది వరకు క్రీడాకారులు వాలీబాల్ క్రీడలో జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించారు. సింగరేణి సంస్థ, ప్రభుత్వ శాఖల్లో 12 మంది ఉద్యోగాలు సాధించారు. కోల్ ఇండియా స్థాయిలో కోసూరి సుదర్శన్ అత్యంత ప్రతిభ కనబర్చి అవార్డు అందుకున్నారు. జాతీయ స్థాయిలో సీనియర్స్ వాలీబాల్ పోటీల్లో చీమల ప్రసాద్ పాల్గొని ప్రతిభ కనబర్చి అవార్డు అందుకున్నారు.

కోచ్‌గా ఉద్యోగం సంపాదించా..



గ్రామంలో నిర్వహించిన వాలీబాల్ పోటీలకు ఆకర్షితుడినై నిరంతరం సాధన చేశాను. రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించాను. దీంతో కోచ్‌గా ఉద్యోగం పొందాను. 1977లో ప్రారంభించిన పోటీలను నేటికీ కొనసాగిస్తూ గ్రామ ప్రత్యేకతను కాపాడుకుంటున్నాం.

–బుగ్గ వెంకటేశ్వర్లు, పీడీ, ఐటీడీఏ

స్టీల్‌ప్లాంట్‌లో జాబ్ కొట్టా..



గ్రామంలో నిర్వహించిన వాలీబాల్ పోటీల స్ఫూర్తితో క్రీడల్లో అంచెలంచెలుగా ఎదిగాను. దీంతో వైజాగ్ స్టీల్ ప్లాంట్‌లో ఉద్యోగం పొందాను. ప్రతి ఏటా సంక్రాంతి పండుగకు గ్రామానికి వచ్చి పోటీల్లో భాగస్వాములమవుతాం. ఇది మా బాధ్యత కూడా..

–మచ్చ శ్రీనివాస్, వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ఉద్యోగి

46 ఏళ్లుగా నిర్వహిస్తున్నాం



సంక్రాంతి పండుగంటేనే మా గ్రామంలో వాలీబాల్ పోటీల సందడి ఉంటుంది. 1977లో మోకాళ్ల పాపయ్య ప్రారంభించిన పోటీలను నేటికీ కొనసాగిస్తున్నాం. అనేక మంది క్రీడల పట్ల మక్కువ పెంచుకుని ప్రభుత్వ ఉద్యోగులుగా స్థిరపడ్డారు. మా శ్రమ సత్ఫలితాన్నిచ్చిందనే ఆనందం మిగిలింది.

– చీమల నాగేశ్వరరావు, గ్రామపెద్ద

16 నుంచి కొత్త కలెక్టరేట్ పాలన

- రేపటిలోగా సామగ్రి తరలించాలని ఆదేశాలు
- ఈసారి గ్రీవెన్స్ సమీకృత కార్యాలయంలోనే జరిగే అవకాశం



నూతన కలెక్టరేట్‌లో దించుతున్న మైనింగ్ శాఖ సామగ్రి



పాత కలెక్టరేట్‌లోనే విధులు నిర్వర్తిస్తున్న ఉద్యోగులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): ఈ నెల 16 నుంచి నూతన కలెక్టరేట్ ద్వారా పూర్తిస్థాయి పాలన సాగనుంది. ముఖ్యమంత్రి కేసీఆర్ లాంఛనంగా నూతన కలెక్టరేట్‌ను ప్రారంభించినప్పటికీ వివిధ శాఖలు తమ కార్యాలయాల సామగ్రిని తరలించలేదు. సంక్రాంతి పండుగ నేపథ్యంలో ఈ వెసులుబాటు కల్పించారు. పాత కలెక్టరేట్ నుంచి కలెక్టర్ చాంబర్‌లోని సామగ్రి తరలించారు. వ్యవసాయశాఖ, మైనింగ్ శాఖ తదితర శాఖలు సామగ్రి తరలిస్తున్నాయి. కలెక్టర్ అనుదీప్ కూడా శుక్రవారం కంటి వెలుగు కార్యక్రమంపై తన క్యాంపు కార్యాలయం నుంచే టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. కార్యకలాపాలు శనివారం వరకు పాత కలెక్టరేట్‌లో, సోమవారం నుంచి కొత్త కలెక్టరేట్‌లో జరగనున్నాయి. ఈ మేరకు కలెక్టర్ నుంచి వివిధ శాఖలకు ఆదేశాలు వెళ్లాయి. ఈ నెల 8న సీఎం పర్యటన ఖరారైందని, ఉన్న తక్కువ సమయం ఏర్పాట్ల కోసమే సరిపోయిందని, దీంతో సామగ్రి తరలించలేకపోయామని ఓ అధికారి వ్యాఖ్యానించారు. శుక్రవారం పాత కలెక్టరేట్‌లోనే కార్యకలాపాలు కొనసాగాయి. ఇన్‌వార్డు, తదితర సెక్షన్ల ఉద్యోగులు అక్కడే విధులు కొనసాగించారు. వచ్చే సోమవారం ప్రజావాణి కార్యక్రమం మాత్రం కొత్త కలెక్టరేట్‌లో జరిగే అవకాశం ఉంది. కాగా సీఎం కొత్త కలెక్టరేట్‌ను ప్రారంభించడంతో ప్రజలందరూ అక్కడి నుంచే పాలన సాగుతుందనే ఆలోచనలో ఉన్నారు. కానీ పాత కలెక్టరేట్ నుంచే పాలన కొనసాగుతుండటంతో అయోమయానికి గురవుతున్నారు. దీనిపై కలెక్టరేట్ నుంచి స్పష్టమైన ప్రకటన రాకపోవడంపై ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

క్లుప్తంగా

తెల్లం వెంకట్రావుకు మంత్రి పువ్వాడ పరామర్శ



వెంకట్రావును పరామర్శిస్తున్న మంత్రి

ఖమ్మంమయూరిసెంటర్: బీఆర్ఎస్ భద్రాచలం నియోజకవర్గ నాయకుడు తెల్లం వెంకట్రావును రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ పరామర్శించారు. గుండె సంబంధిత చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రిలో చేరిన ఆయన్ను మంత్రి శుక్రవారం పరామర్శించాక, చికిత్సపై వైద్యులతో మాట్లాడారు. భద్రాద్రి జిల్లా జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

భూకబ్జా యత్నానికి అడ్డుకట్ట



మట్టి గుట్టలను పరిశీలిస్తున్న ఆర్అండ్‌బీ డీఈ శ్రీనివాస్

దమ్మపేట: మండలంలోని ఆర్అండ్‌బీ భవనానికి వెను భాగంలో ఉన్న ప్రభుత్వ భూమిని కొందరు ఆక్రమించేందుకు ప్రయత్నించగా స్థానికులు అడ్డుకున్నారు. శుక్రవారం చోటుచేసుకున్న ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి.. మండల కేంద్రంలో రాష్ట్రీయ రహదారికి పక్కనే ఆర్అండ్‌బీ గెస్ట్ హౌజ్ వెనుక భాగంలో ఖాళీగా ఉన్న స్థలాన్ని ఆక్రమించేందుకు కొందరు గుర్తు తెలియని వ్యక్తులు గురువారం అర్ధరాత్రి సమయంలో మట్టిని తొలగించే పనులు చేపట్టారు. నివాసయోగ్య స్థలంగా మార్చేందుకు యత్నించారు. విషయం తెలుసుకున్న స్థానికులు శుక్రవారం రెవెన్యూ అధికారులకు సమాచారం అందించగా, ఆర్ఐ ఘటనా స్థలానికి చేరుకుని, ప్రభుత్వ భూమిలో ఉన్న మట్టి గుట్టలను పరిశీలించారు. విషయం తెలుసుకున్న ఆర్అండ్‌బీ డీఈ శ్రీనివాస్ అక్కడికి వచ్చి పరిశీలించి, స్థానికులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. విషయాన్ని తహసీల్దార్‌కు తెలియజేసి, కబ్జాకు ప్రయత్నించిన వ్యక్తులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

చండ్రుగొండ: మండలంలోని మహ్మద్‌నగర్ గ్రామ శివారు జామాయిల్ ప్లాంటేషన్‌లో పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో శుక్రవారం పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. రూ.2,500 నగదు, ద్విచక్రవాహనం, ఒక సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ గొల్లపల్లి విజయలక్ష్మి తెలిపారు.

కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలి

కలెక్టర్ అనుదీప్

సూపర్‌బజార్(కొత్తగూడెం): ఈ నెల 18 నుంచి ప్రారంభించనున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ అన్నారు. జిల్లా అధికారులతో క్యాంపు కార్యాలయం నుంచి శుక్రవారం టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలోని 481 గ్రామ పంచాయతీలు, 4 మున్సిపాలిటీలు, 107 వార్డులలో కార్యక్రమం జరుగుతుందన్నారు. నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం కంటి వెలుగు కార్యక్రమం జరగాలని ఆదేశించారు. గ్రామ పంచాయతీ, మున్సిపాలిటీలు, రేషన్ దుకాణాల్లో కంటి వెలుగు కార్యక్రమ నిర్వహణపై ప్రజలకు అవగాహన కల్పించే విధంగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని చెప్పారు. 18న 48 కేంద్రాలలో నిర్దేశించిన విధంగా కంటివెలుగు కార్యక్రమం ప్రారంభం కావాలని, ప్రజా ప్రతినిధులను ఆహ్వానించి భాగస్వాములు చేయాలని పేర్కొన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, జిల్లా వైద్యాధికారి శిరీష, డీఆర్‌డీఓ మధుసూదన్‌రాజు, డీపీఓ రమాకాంత్, మున్సిపల్ కమిషనర్లు శ్రీకాంత్, అంకుష్‌వలీ, భద్రాచలం ఆర్డీఓ రత్నకల్యాణి తదితరులు పాల్గొన్నారు.



టెలీకాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ అనుదీప్

● సజావుగా కంటి వెలుగు..

జిల్లా ఇమ్యూనైజేషన్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ బాలాజీ

అశ్వారావుపేటరూరల్: రెండో విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని సక్రమంగా నిర్వహించాలని జిల్లా ఇమ్యూనైజేషన్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ బాలాజీనాయక్ సూచించారు. మండలంలోని వినాయకపురం, గుమ్మడవల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఆయన శుక్రవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ నెల 18వ తేదీ నుంచి జరిగే కంటి వెలుగు నిర్వహణ ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం వినాయకపురం పీహెచ్‌సీ వద్ద నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కంటి వెలుగు కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించి విజయవంతం చేయాలన్నారు. శిబిరాల వద్దకు వచ్చే వారికి ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలని, తాగునీటి సౌకర్యాన్ని ఏర్పాటు చేయాలని సూచించారు. సమావేశంలో సీహెచ్‌ఓ నాగభూషణం, పీహెచ్‌సీ వైద్యుడు రాందాస్, కంటి వెలుగు క్యాంపు వైద్యాధికారులు డాక్టర్ మాధురి, డాక్టర్ వెంకటేశ్వర్లు, సబ్ యూనిట్ అధికారి అజ్మీర వెంకటేశ్వరరావు, హెల్త్ సూపర్‌వైజర్ శ్రీను పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ బాలాజీ

వరుస చోరీల నిందితుడు అరెస్ట్

బూర్గంపాడు: వరుస చోరీలకు పాల్పడుతూ జైలుశిక్ష అనుభవించి బయటకు వచ్చి మళ్లీ దొంగతనాలకు పాల్పడుతున్న వ్యక్తిని శుక్రవారం బూర్గంపాడు పోలీసులు పట్టుకున్నారు. అందుకు సంబంధించిన వివరాలను శుక్రవారం రాత్రి పాల్వంచ సీఐ నాగరాజు వెల్లడించారు. ఈ నెల 4వ తేదీ సారపాక గాంధీనగర్‌లో పడముత్యం రఘుబాబు ఇంట్లో పట్టపగలే చోరీ జరిగింది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇంటి తలుపులు తీసి బీరువా తాళం పగలగొట్టి బంగారు, వెండి ఆభరణాలను దొంగలు ఎత్తుకెళ్లారు. ఈ ఘటనకు సంబంధించి సమాచారం అందిన వెంటనే బూర్గంపాడు ఎస్ఐ సంతోష్ ఘటనా ప్రాంతానికి వెళ్లి క్లూస్ టీమ్, డాగ్ స్క్వాడ్‌తో దర్యాప్తు ప్రారంభించారు. ఫింగర్ ప్రింట్లు సేకరించి లోతుగా దర్యాప్తు చేశారు. వేలిముద్రల ఆధారంగా ఈ చోరీకి పాల్పడిన వ్యక్తి భద్రాచలంలోని భగవాన్‌దాస్ కాలనీకి చెందిన రాజమండ్రి రాజేశ్‌గా నిర్ధారణకు వచ్చారు. బూర్గంపాడు ఎస్ఐలు సంతోష్, రమణారెడ్డి రెండు బృందాలుగా విడిపోయి అతడి కోసం గాలింపు మొదలుపెట్టారు. ఈ క్రమంలో శుక్రవారం సాయంత్రం వాహనాలను తనిఖీ చేస్తుండగా రాజమండ్రి రాజేశ్‌ను గుర్తించి పట్టుకున్నారు. గతంలో ఇతను ఏడు చోరీలకు సంబంధించి జైలుశిక్ష అనుభవించాడు. గాంధీనగర్‌లో చోరీ చేసిన అనంతరం అతను చింతూరు ప్రాంతానికి వెళ్లి కొన్ని రోజులు అక్కడే ఉన్నారు. శుక్రవారం తన వద్ద బంగారు, వెండి ఆభరణాలను విక్రయించేందుకు వస్తూ పోలీసులకు పట్టుబడ్డాడు. అతడి వద్ద నుంచి 9 తులాల బంగారు, 10 తులాల వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపారు. ఈ చోరీ ఘటనను ఛేదించటంలో సీసీఎస్ ఇన్‌స్పెక్టర్, క్లూస్ టీమ్, ఎస్ఐలు సంతోష్, రమణారెడ్డి, ఏఎస్ఐ సత్యనారాయణ, కానిస్టేబుళ్లు రామకృష్ణ, మంగీలాల్, కృష్ణను సీఐ నాగరాజు అభినందించారు.



నిందితుడిని చూపుతున్న సీఐ, ఎస్ఐలు

చికిత్స పొందుతున్న రైతు మృతి

ఫర్టిలైజర్ వ్యాపారి తీరుతో ఆత్మహత్యాయత్నం

టేకులపల్లి: మండలంలోని తొమ్మిదోమైలుతండాలో ఫర్టిలైజర్ వ్యాపారి తీరుతో మనస్తాపానికి గురై పురుగులమందు తాగిన రైతు చికిత్స పొందుతూ మృతి చెందాడు. తండాకు చెందిన రైతు భూక్యా హరిలాల్ (45) అదే గ్రామానికి చెందిన విత్తన, పురుగు మందుల డీలర్ 'మీ రైతు మిత్ర ట్రేడర్స్'యజమాని భద్రు వద్ద అప్పుగా విత్తనాలు, పురుగుమందులు, ఎరువులు తీసుకుని పంటలు సాగు చేశాడు. ఆ తర్వాత అప్పు తీర్చే క్రమంలో డీలర్ అధిక ధరలు, వడ్డీ వసూలు చేశాడని ఆరోపించగా ఆయన కుటుంబం దాడి చేసిందనే మనస్తాపంతో బుధవారం రాత్రి పురుగులమందు తాగిన విషయం విదితమే. ఈ మేరకు హరిలాల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. కాగా, రైతు కుటుంబానికి న్యాయం చేయాలని, డీలర్‌ను శిక్షించాలనే డిమాండ్‌తో హరిలాల్ కుటుంబ సభ్యులు, గ్రామస్తులు రాత్రి టేకులపల్లి పోలీసుస్టేషన్‌కు వచ్చారు. అక్కడ ఆందోళనకు యత్నించడంతో సీఐ ఇంద్రసేనారెడ్డి, ఎస్ఐ భూక్యా శ్రీనివాస్ వారికి నచ్చజెప్పి కేసు నమోదు చేస్తున్నట్లు చెప్పి పంపించారు.

వైద్యుడు, సిబ్బందిపై చర్యలు

డాక్టర్ సహా ఐదుగురి సిబ్బందిపై బదిలీ వేటు

పాల్వంచరూరల్: మహిళా సిబ్బందిపై లైంగిక వేధింపులకు పాల్పడుతున్నట్లు వచ్చిన ఆరోపణల నేపథ్యంలో వైద్యుడిని వైద్యా ఆరోగ్యశాఖ అధికారులు బదిలీ చేశారు. మరో నలుగురు సిబ్బందిపై కూడా వేటు పడింది. మండలంలోని జగన్నాథపురంలోని పెద్దమ్మగుడి వద్ద గల గిరిజన ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో విధులు నిర్వర్తిస్తున్న డాక్టర్ రాజశేఖర్, ల్యాబ్ టెక్నీషియన్ కృష్ణయ్య, సూపర్‌వైజర్ మల్లికార్జున్‌లు లైంగిక వేధింపులకు పాల్పడుతున్నట్లు అధికారులకు ఫిర్యాదు అందింది. దీంతో గత నెల 30న డీఎంహెచ్‌ఓ శిరీష విచారణ జరిపారు. విచారణ అనంతరం సిబ్బంది మధ్య విభేదాలు కూడా ఉన్నట్లు అధికారులు గుర్తించారు. దీంతో ఐదుగురు సిబ్బందిని వివిధ ప్రాంతాలకు బదిలీ చేశారు. డాక్టర్ రాజశేఖర్‌ను గుడిపాడుకు, ల్యాబ్ టెక్నీషియన్ కృష్ణయ్యను అశ్వారావుపేటలోని గుమ్మడివల్లికి, హెల్త్ సూపర్‌వైజర్ మల్లికార్జున్, ఏఎన్ఎం సావిత్రిని మంగపేటకు, పీహెచ్ఎన్ యశోదను ఆళ్లపల్లికి బదిలీ చేశారు. ఈ మేరకు శుక్రవారం డీఎంహెచ్‌ఓ శిరీష వివరాలు వెల్లడించారు.

బాలుడిది అదృశ్యం.. కాదు కిడ్నాప్!

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని అశోక్‌నగర్‌కాలనీకి చెందిన బాలుడు (8) ఈ నెల 7న ఇంటి ముందు ఆడుకుంటూ కనిపించకుండా పోయాడు. దీంతో కుటుంబసభ్యులు ఎక్కడ వెతికినా ఆచూకీ లభించకపోవడంతో ఆదే రోజు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై విచారణ చేపట్టిన పోలీసులు బాలుడిది అదృశ్యం కాదని, కిడ్నాప్ అని గుర్తించారు. సీసీ కెమెరాల ఆధారంగా నిందితులను గుర్తించి విచారించగా బాలుడిని విజయవాడలో సుమారు రూ.4 లక్షలకు విక్రయించిన్నట్లు తెలిసింది. పోలీసులు నిందితులను తీసుకొని బాలుడి ఆచూకీ కోసం శుక్రవారం విజయవాడ వెళ్లినట్లు సమాచారం.

ధనాధన్ టోర్నీకి వేళాయె..

సాక్షి ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నీకి ఎంట్రీల ఆహ్వానం

SAKSHI DIGITAL MEDIA GROUP · SPL SAKSHI PREMIER LEAGUE

బ్యాట్ పట్టుకొని బంతిని బౌండరీ దాటించాలని ఉందా? బుల్లెట్ వేగంతో బంతులు వేస్తూ వికెట్లను గిరాటేయాలని ఉందా? మెరుపు వేగంతో కదులుతూ బ్యాటర్లను రనౌట్ చేయాలని ఉందా? క్రికెట్ ఆడేద్దామని.. మనలోని ప్రతిభను ప్రపంచానికి చాటి చెప్పాలని మనసులో బలమైన కోరిక ఉంటే సరిపోదు.. దానికి వేదిక కూడా కావాలిగా! ఇలాంటి ఔత్సాహిక క్రికెటర్లు తమ కలలు నెరవేర్చుకునేందుకు మళ్లీ సమయం వచ్చేసింది. మరో ఆలోచన లేకుండా ముందుగా మీ జట్టును తయారు చేసుకొని ఎంట్రీలు పంపించండి.. ఆ తర్వాత సమరానికి సై అనండి.

Regional sponsor

SUDHAKAR PIPES AND FITTINGS
LEADER IN QUALITY AND TECHNOLOGY

ఔత్సాహిక క్రికెటర్లకు సువర్ణావకాశాలు కల్పించాలనే సదుద్దేశంతో సాక్షి మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో ఈ నెల(జనవరి) నాలుగో వారంలో సాక్షి ప్రీమియర్ లీగ్ (ఎస్‌పీఎల్) క్రికెట్ టోర్నీ నాలుగో సీజన్ మొదలుకానుంది.

టోర్నీ ఫార్మాట్..
ముందుగా జిల్లా, ప్రాంతీయ, రాష్ట్ర స్థాయిలో నాకౌట్ పద్ధతిలో మ్యాచ్‌లు జరుగుతాయి. ఈ మ్యాచ్‌లను 10 ఓవర్లపాటు నిర్వహిస్తారు. జిల్లా స్థాయిలో విజేతగా నిలిచిన జట్లు ప్రాంతీయ స్థాయి టోర్నీకి అర్హత సాధిస్తాయి. ఈ మ్యాచ్‌లను 20 ఓవర్లపాటు నిర్వహిస్తారు. ప్రాంతీయ స్థాయి టోర్నీ విజేతలు రాష్ట్ర స్థాయిలో రౌండ్ రాబిన్ లీగ్ పద్ధతిలో టైటిల్ కోసం తలపడతాయి. ఉమ్మడి జిల్లాలే ప్రాతిపాదికగా ఎంట్రీలు స్వీకరిస్తారు.

ఎంట్రీ ఫీజు..
ఈ టోర్నీలో పాల్గొనాలనుకునే జట్లు రూ.1,500 ఎంట్రీ ఫీజుగా చెల్లించాల్సి ఉంటుంది. ఈ మొత్తాన్ని ఆన్‌లైన్‌లోనూ, ఆఫ్‌లైన్ పద్ధతిలోనూ చెల్లించవచ్చు. వివరాలకు సాక్షి జిల్లా యూనిట్ కార్యాలయంలో సంప్రదించాలి. https://www.arenaone.in/registration వెబ్‌సైట్‌లోనూ వివరాలు లభిస్తాయి. ఎంట్రీలను ఈ నెల 22తేదీలోపు పంపించాలి.

ఏ ఏ విభాగాల్లో...
ఈ లీగ్‌ను రెండు కేటగిరీల్లో నిర్వహిస్తారు. అండర్–19 జూనియర్ స్థాయిలో (1 జనవరి 2003 తర్వాత జన్మించి ఉండాలి). అండర్–25 సీనియర్ స్థాయిలో (1 జనవరి 1997 తర్వాత జన్మించి ఉండాలి) వేర్వేరుగా నిర్వహిస్తారు.
జూనియర్ స్థాయిలో ఆడేందుకు జూనియర్ కాలేజీ జట్లకు, సీబీఎస్ఈ స్కూల్ (ప్లస్ 1, 2) జట్లకు, ఐటీఐ, పాలిటెక్నిక్ జట్లకు అర్హత ఉంది. సీనియర్ స్థాయిలో ఆడేందుకు డిగ్రీ, పీజీ, మెడిసిన్, ఇంజనీరింగ్, ఫార్మా కాలేజీ జట్లకు అవకాశం కల్పిస్తారు.

ఎన్ని జట్లకు అవకాశం..
ఒక్కో కాలేజీ నుంచి గరిష్ఠంగా రెండు జట్లను పంపించే వెసులుబాటు ఉంది. రెండు జట్లు కూడా వేర్వేరుగా ఎంట్రీ ఫీజు చెల్లించాలి. ఒక జట్టులో ఆడే ఆటగాడు మరో జట్టుకు ఆడకూడదు. మ్యాచ్‌లు ఆడే సమయంలో ఆటగాళ్ల వయసు ధ్రువీకరణ పత్రాలను చూపించాల్సి ఉంటుంది. మ్యాచ్ సమయంలో ఇరుజట్ల ఆటగాళ్లు తమ కళాశాల గుర్తింపు కార్డు (ఒరిజినల్) చూపించాలి. మ్యాచ్ జరిగే సమయంలో బ్యాటర్స్, వికెట్ కీపర్ తప్పనిసరిగా హెల్మెట్లు, లెగ్ ప్యాడ్‌లు, అండర్ గార్డ్స్, హ్యాండ్ గ్లౌవ్స్, వైట్ డ్రెస్, వైట్ షూస్ ధరించాలి.
ఇతర వివరాలకు నిర్వాహకులను సంప్రదించాల్సిన ఫోన్ నంబర్ : 96660 13544
గమనిక: అన్ని విషయాల్లో నిర్వాహకులదే తుది నిర్ణయం.

మాజీ సేల్స్‌మెన్‌ను హతమార్చిన మావోలు

బీజాపూర్ జిల్లా ఊసూరులో ఘటన

చర్ల: మాజీ సేల్స్‌మెన్‌ను మావోయిస్టులు దారుణంగా హతమార్చారు. పోలీస్ స్టేషన్‌కు కూత వేటు దూరంలోనే ఉన్న ధాన్యం కొనుగోలు కేంద్రంలో పట్టపగలే ఈ ఘటన జరగడంతో అక్కడి రైతులు భయంతో పరుగులు తీశారు. తెలంగాణ సరిహద్దు ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లా ఊసూరులో శుక్రవారం ఉదయం ఈ ఘటన జరిగింది. సుకుమా జిల్లా పోలంపల్లికి చెందిన గట్టుపల్లి రామ్మూర్తి(36) ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంలో సేల్స్‌మెన్‌గా పని చేసేవాడు. ఈ క్రమంలో ఆయనను మావోయిస్టులు టార్గెట్ చేయడంతో పోలంపల్లి నుంచి ఊసూరుకు మకాం మార్చి పని మానేశాడు. ఆ తర్వాత వ్యవసాయం మొదలుపెట్టిన ఆయన పండించిన ధాన్యాన్ని అమ్మేందుకు ఊసూరులోని కొనుగోలు కేంద్రానికి వచ్చాడు. ఈ క్రమంలో అక్కడకు సాధారణ రైతుల్లా వచ్చిన మావోయిస్టులు రామ్మూర్తిని కత్తులతో పొడవడంతో పాటు కర్రలతో విపరీతంగా కొట్టగా రైతులు పరుగులు తీశారు. అనంతరం ఆయనను హతమార్చి వెళ్లిపోయారు. ఈ ఘటన పోలీస్ స్టేషన్‌కు కేవలం కిలోమీటర్ దూరాన పట్టపగలే జరగడం గమనార్హం. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని దర్యాప్తు చేపట్టారు.



రామ్మూర్తి మృతదేహం

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

అశ్వారావుపేటరూరల్: ఓ వ్యక్తి ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని గుర్రాలచెరువు గ్రామ పంచాయతీ పరిధిలోని మారుతినగర్‌కు చెందిన పాకనాటి ప్రసాద్ (30) కొంతకాలంగా అతిగా మద్యం సేవిస్తున్నాడు. ఆర్థిక ఇబ్బందులు తీవ్రం కావడంతో మనస్తాపం చెంది ఇంట్లోనే ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడుకి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. వారిలో ఒకరికి నాలుగేళ్లు కాగా, చిన్న కుమారుడు మూడు నెలల కిందట అనారోగ్య సమస్యలతో మృతి చెందాడు. సమాచారం అందుకున్న స్థానిక ఎస్ఐ సాయికిశోర్‌రెడ్డి మృతదేహాన్ని పరిశీలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

భిక్షాటన చేసిన కార్మికులు

ఇల్లెందు: పండుగ పూట అధికారులు, ప్రజా ప్రతినిధులు, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు ఆనందంగా కుటుంబంతో గడుపుతుంటే ఆశ్రమ పాఠశాలలు వసతిగృహాల్లో పనిచేస్తున్న దినసరి, ఔట్ సోర్సింగ్ వర్కర్లు మాత్రం పస్తులు ఉంటున్నారని సీఐటీయూ జిల్లా నాయకుడు అబ్దుల్ నబీ, తాళ్లూరి కృష్ణ అన్నారు. శుక్రవారం ఇల్లెందులోని ఐటీడీఏ కాంప్లెక్సులో వంటా వార్పు నిర్వహించారు. తొలుత విద్యుత్ కార్యాలయం ప్రాంతంలో ఇంటింటికీ తిరిగి, షాపుల ముందు భిక్షాటన చేశారు. వేతనాలు అందక, అప్పులు పుట్టక, కుటుంబాలు గడువక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఈ సందర్భంగా కార్మికులు తెలిపారు. కార్యక్రమంలో పద్మ, జయ, అంజమ్మ, సుధా, దీప, సుజాత, సరోజ, విజయభారతి, భద్రమ్మ, భారతి, శైలజ, వెంకటమ్మ, రమ, సుబ్రహ్మణ్యం, అనిత, నాగయ్య తదితరులు పాల్గొన్నారు.



భిక్షాటన చేస్తున్న కార్మికులు

తప్పని 'అంతిమ' కష్టాలు

కొట్టుకుపోయిన చప్టా దాటేందుకు మృతుల బంధువుల అవస్థ

ఇల్లెందు: ఇక్కడ ఎవరైనా కన్నుమూస్తే అంత్యక్రియలు నిర్వహించేందుకు కూడా ఆపసోపాలు పడాల్సి వస్తోంది. కన్నుమూసిన వ్యక్తిని గౌరవంగా సాగనంపాలని భావించినా అది సాధ్యం కావడంలేదు. చెరువుపై అలుగు చప్టా వరదతో కొట్టుకుపోయినా ఎవరూ పట్టించుకోకపోవడంతో ఈ పరిస్థితి ఎదురవుతోంది. ఇల్లెందు 2వ వార్డు ఇల్లెందులపాడులో హిందూ శ్మశానవాటిక ఉంది. అక్కడకు వెళ్లాలంటే ఇల్లెందులపాడు చెరువు అలుగు వాగు దాటాలి. గత వర్షాకాలంలో భారీ వర్షాలకు అలుగుచప్టా కొట్టుకుపోయింది. దీంతో స్థానికులు శ్మశానవాటికకు వెళ్లే క్రమంలో అవస్థ పడుతున్నారు. గురువారం వార్డుకు చెందిన ఆర్.రామారావు(65) మృతి చెందగా ఆయన మృతదేహాన్ని తీసుకెళ్లేందుకు బంధువులు అష్టకష్టాలు పడ్డారు. వాగు వరకు బంధువులు, మహిళలు వచ్చినా కొందరు మాత్రమే శ్మశానవాటిక వరకు వెళ్లగలగడం విషాదాన్ని నింపింది.



కొట్టుకుపోయిన చప్టాపై మృతదేహంతో వెళ్తున్న బంధువులు

వరిగడ్డి వాము దగ్ధం



దగ్ధమవుతున్న వరిగడ్డివాము

చర్ల: మండలంలోని రాళ్లగూడెం గ్రామంలో (చర్ల) శుక్రవారం ఉదయం జరిగిన అగ్నిప్రమాదంలో అదే గ్రామానికి చెందిన బండారి నరేంద్రకు చెందిన వరి గడ్డివాము దగ్ధమైంది. రైతు నాగేంద్ర ఇటీవల వరి కోతలు పూర్తయిన తరువాత తన గేదెల మేతకు అవసరమైన గడ్డి కొనుగోలు చేసి గ్రామం చివరిలో వాముగా వేశాడు. కాగా, శుక్రవారం ఉదయం గడ్డి వాము నుంచి ఒక్కసారిగా మంటలు చెలరేగి మొత్తానికి వ్యాపించి పూర్తిగా దగ్ధమైంది. ఈ ప్రమాదంలో బాధిత రైతుకు సుమారు రూ.50 వేల మేర ఆస్తి నష్టం వాటిల్లింది.

కేటీపీఎస్‌లో ప్రమాదం..

పావల్ ఢీకొని డీజిల్ హెల్పర్ మృతి



శ్రావణ్‌కుమార్ (ఫైల్)

టేకులపల్లి: కోయగూడెం ఓపెన్‌కాస్టులో జరిగిన ఓ ప్రమాదంలో కాంట్రాక్టు కార్మికుడు మృతి చెందిన ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. పాల్వంచ మండలం నాగారం గ్రామానికి చెందిన నక్క రాంబాబు, రాంబాయి దంపతుల కుమారుడు నక్క శ్రావణ్‌కుమార్ (23) కేటీపీఎస్‌లోని ఓబీ కాంట్రాక్టర్ వద్ద డీజిల్ హెల్పర్‌గా పని చేస్తున్నాడు. ఈ నేపథ్యంలో రోజువారి డ్యూటీలో భాగంగా గురువారం రాత్రి ఓబీ క్వారీలో షావల్‌కు డీజిల్ నింపి, మినీ డీజిల్ ట్యాంకు ఎక్కి రీడింగ్ చూసుకుంటున్న సమయంలో ముందుకు వెళ్లిన షావల్ అనుకోకుండా వెనక్కి వచ్చి శ్రావణ్‌ను ఢీకొట్టడంతో తీవ్ర గాయాలపాలయ్యాడు. సమాచారం తెలుసుకున్న ఎస్‌వీఈసీ ఇన్‌చార్జ్ రామిరెడ్డి సింగరేణి అంబులెన్స్‌లో ఖమ్మం ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ రాత్రి మృతి చెందాడు. ప్రమాద స్థలాన్ని డీఎంఎస్ ఎస్‌జీ బైసారె, డీడీఎంఎస్ దిలీప్‌కుమార్, కేటీపీ ప్రాజెక్టు ఆఫీసర్ ఎన్‌వీఆర్ ప్రహ్లాద్ తదితర అధికారులు సందర్శించారు. శుక్రవారం పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

రూ.33 లక్షల పరిహారం
కేటీపీఎస్‌లో ప్రమాదవశాత్తు మృతి చెందిన శ్రావణ్ కుటుంబానికి ఎస్‌వీఈసీ కంపెనీ నష్టపరిహారం చెల్లించింది. నగదు, చెక్కుల రూపంలో శుక్రవారం రాత్రే రూ.33 లక్షలు నష్టపరిహారం చెల్లించారు.

పూరిల్లు దగ్ధంపై కేసు నమోదు

అశ్వాపురం: మండలంలోని మల్లెలమడుగు గ్రామంలో ఈ నెల 1వ తేదీన ప్రమాదవశాత్తూ పూరిల్లు దగ్ధమైన ఘటనపై అశ్వాపురం పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం కేసు నమోదైంది. శుక్రవారం బాధితుడు గుంజాల కృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ జితేందర్ తెలిపారు. కాగా, విద్యుత్ షార్ట్ సర్క్యూట్ ఇల్లు దగ్ధం కాగా, అందులో రూ.3,50,000 నగదు, బంగారం, వెండి ఆభరణాలు, టీవీఎస్ ఎక్స్ఎల్ వాహనం కాలిబూడిదయ్యాయని, మొత్తం రూ.6,95,500 నష్టం వాటిల్లిందని బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నాడని ఎస్ఐ వివరించారు.

నమ్మించి మోసం చేశాడు..

షార్ట్ ఫిల్మ్ తీయాలని తీసుకొచ్చి కెమెరాలు చోరీ

భద్రాచలంటౌన్: షార్ట్ ఫిల్మ్ చిత్రీకరణ ఉందని చెప్పి ఓ అగంతకుడు ఇద్దరు ఫొటోగ్రాఫర్లను భద్రాచలం తీసుకొచ్చాడు. అనంతరం వారి కెమెరాలను అపహరించిన ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. శుక్రవారం బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాలిలా ఉన్నాయి.. ఏపీలోని పశ్చిమ గోదావరి జిల్లా ఉండ్రాజవరం మండలం తాడిపర్రు గ్రామానికి చెందిన రాచూరి వెంకటనూకరాజు గ్రామంలో 'కామ్ గైస్'పేరుతో స్టూడియో నిర్వహిస్తున్నాడు. ఆదే గ్రామానికి చెందిన యర్రంశెట్టి ఆంజనేయులు షార్ట్ ఫిల్మ్ తీయాలని అందుకు అక్కిశెట్టి కార్తీక్ చౌదరిని సంప్రదించామని నూకరాజుకు ఫోన్ నంబర్ ఇచ్చాడు. దీంతో నూకరాజు అక్కిశెట్టి కార్తీక్‌చౌదరికి ఫోన్ చేయగా తెలంగాణ టూరిజం శాఖకు సంబంధించిన షార్ట్ ఫిల్మ్ తీయాలనడంతో మరో ఫొటోగ్రాఫర్‌తో కలిసి ఈ నెల 11న మధ్యాహ్నం కారులో భద్రాచలం వచ్చారు. పట్టణంలోని భార్గవ రెసిడెన్సీలో రూమ్ తీసుకున్నారు. ఉదయం షూట్ ఉంటుందని, విశ్రాంతి తీసుకోండని ఫొటోగ్రాఫర్లకు చెప్పి కార్తీక్‌చౌదరి బయటకు వెళ్లాడు. 12న ఉదయం ఫొటోగ్రాఫర్లకు శ్రీసీతారామ చంద్ర స్వామివారి దేవస్థానానికి తీసుకెళ్లిన కార్తీక్ చిన్న పనిఉందని చెప్పి వారిని అక్కడే వదిలేసి వెళ్లాడు. ఎంత సేపటికి రాకపోవడంతో లాడ్జికి వచ్చిన ఫొటోగ్రాఫర్లకు రూమ్ లాక్ చేసి ఉండటంతో బయటకు వెళ్లి వస్తాడులే అని వేచిచూశారు. ఎంతకూ రాకపోగా కార్తీక్ ఫోన్ సాయంత్రం నుంచి స్విచ్ ఆఫ్ వస్తోంది. దీంతో లాడ్జి యజమానిని సంప్రదించగా రెండో తాళంతో శనివారం ఉదయం లాక్ తీయగా కెమెరాలను కార్తీక్ అపహరించిన్నట్లు గుర్తించారు. కార్తీక్ రూమ్ బుక్ చేసిన్నప్పుడు ఇచ్చిన ఆధార్ జిరాక్స్ కూడా నకిలీదని గుర్తించి లాడ్జిలోని సీసీ కెమెరాల ఆధారంగా కార్తీక్‌పై బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అపహరణకు గురైన కెమెరాల విలువ సుమారు రూ.13 లక్షలు ఉంటుందని వారు పేర్కొన్నారు.